క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నరసరావుపేట: అంగన్‌వాడీల న్యాయమైన అన్ని సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరింత మెరుగ్గా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ స్థానిక పీడీ కార్యాలయంలో మంగళవారం సూపరింటెండెంట్ బాబురావుకు వినతిపత్రం అందజేశారు. మల్లీశ్వరి మాట్లాడుతూ సమ్మె సందర్భంగా టీఏలు, డీఏలు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఒక రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు నిర్మల, సాయికుమారి పాల్గొన్నారు.

సమయపాలన అందరూ పాటించాలి

శావల్యాపురం: గ్రామసచివాలయాల సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరు పరిశీలించి సూచనలు సలహాలిచ్చారు. ఆయనతో పాటు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దయామయుడు ప్రవక్త మహమ్మద్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సాధన ఇనిస్టిట్యూట్‌లో డైరెక్టర్ ఎస్‌కెఎం బాషా ఆధ్వర్యంలో మీలాదుల్ నబి మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినుకొండ మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కవి కరిముల్లా, సాంఘిక ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజోమూర్తి



ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాలలో మొక్కలు నాటుతున్న డాక్టర్ దివ్యతేజోమూర్తి

నరసరావుపేట ఈస్ట్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములై మొక్కలు నాటాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజోమూర్తి తెలిపారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల నిర్వహణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ.సరళాదేవి, టి.వి.శంకరరెడ్డి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో...

వాగ్దేవి కళాశాలను సందర్శించిన వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి మొక్కలు నాటి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీబీ స్ట్రీట్‌లో ట్రాఫిక్ పరిస్థితి



గడియార స్తంభం రోడ్డులో రద్దీ

ఆక్రమణలు తొలగేనా?

- చిలకలూరిపేటలో ఆక్రమణల తొలగింపుపై లోకాయుక్త ఉత్తర్వులు
- అయినా ఎలాంటి చర్యలు చేపట్టని మున్సిపల్ అధికారులు



లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వుల ప్రతి

చిలకలూరిపేట: ఎటు చూసినా ఇరుకు సందులు... వాహనాల రాకపోకలతో పాదచారులు నడిచేందుకు ఇక్కట్లు... రోడ్ల పైకి చొచ్చుకు వచ్చిన దుకాణ సముదాయాలు.. పట్టించుకోని అధికార యంత్రాగం ... ఇది చిలకలూరిపేట పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్ర లోకాయుక్త మూడు ప్రధాన వీధుల్లో ఆక్రమణల తొలగింపుపై జారీ చేసిన ఉత్తర్వులు ఆసక్తి కలిగిస్తున్నాయి.

లోకాయుక్త ఆదేశాలు

పట్టణానికి చెందిన విశ్రాంత న్యాయమూర్తి కె.విజయకుమార్ ఆక్రమణల విషయమై లోకాయుక్తను ఆశ్రయించగా ఇటీవల కాలంలో పట్టణంలోని మూడు ప్రధాన వీధుల్లో ఆక్రమణల తొలగింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు, రూరల్ పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి విజయాబ్యాంక్ సెంటర్(జాతీయ రహదారి) వరకు, చలివేంద్రం బజారు నుంచి శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఆక్రమణలు తొలగించాలి. వాస్తవానికి ఇది ఎప్పటి నుంచో ఉన్న సమస్య. పట్టణ ప్రజలతో పాటు పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఆక్రమణల తొలగింపుపై పలువురు కౌన్సిలర్లు ప్రస్తావించారు.

ఆ.. రహదారులు ఎప్పుడూ కిటకిటే!

లోకాయుక్త ఉత్తర్వుల్లో పేర్కొన్న మూడు మార్గాలు నిత్యం ప్రజలు, వాహనాలతో ఇసుకవేస్తే రాలనంత చందంగా కిటకిటలాడుతుంటాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నుంచి గడియార స్తంభం సెంటర్ మధ్య ఉన్న మెయిన్ బజార్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో రద్దీని భరించలేక వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు అనేకమార్లు బారికేడ్లు, ఐరన్ పోల్స్ అడ్డుగా ఏర్పాటు చేసినా పెద్దగా సమస్యకు పరిష్కారం లభించలేదు.

లోకాయుక్త ఏం చెప్పిందంటే..

లోకాయుక్త ఉత్తర్వుల ప్రకారం మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అనుసరించి ఆక్రమణలు గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. దీనిని బట్టి మాస్టర్ ప్లాన్‌లో ఏ రోడ్డు ఎంత అడుగుల వెడల్పు, పొడవు ఉందో గుర్తించి దాని ప్రకారం ఆక్రమణలు తొలగించాలి.

ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు ఆక్రమణలపై దృష్టి సారిస్తారా.. లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. లోకాయుక్త ఉత్తర్వుల్లో లేని కేబీ రోడ్డులోని ఆక్రమణలపై దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు ఈ ఏడాది జులై ఒకటో తేదీన లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వుల పై స్పందించకపోవడం మరో ఆసక్తికర అంశం.

వామ్మో.. చలివేంద్రం బజారు!



ఇక చలివేంద్రం బజారులో పరిస్థితి వర్ణనాతీతం. కిరాణా, ఇతర దుకాణాలకు తరలివచ్చే వాహనాలతో ఈ ప్రాంతంలో కాలుమోపడమే కష్టంగా ఉంటుంది. గతంలో పగటిపూట ఇక్కడ లారీలు అన్‌లోడ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ రానురాను పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పగలు వచ్చే వాహనాలతో దారుణమైన పరిస్థితి నెలకొంది. దీనికి ముందు ఉండే టీబీ స్ట్రీట్‌లో ఫ్యాన్సీ, ఇతర దుకాణాలు విస్తరించి ఉంటాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రించటం కష్టతరంగా మారింది. ఇక చౌత్రా సెంటర్ నుంచి విజయా బ్యాంక్ వరకు ఆక్రమణల నేపథ్యంలో ట్రాఫిక్‌కు బాగా ఇబ్బందికర పరిస్థితులు నెలకొని ఉంటాయి.

చర్యలు తీసుకుంటాం

లోకాయుక్త ఉత్తర్వులు అందాయి. పనుల ఒత్తిడి నేపథ్యంలో వాటిని పరిశీలించలేదు. సాధ్యమైనంత త్వరలో స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్

ఆర్భాటాలు మాని..

బాధితులను ఆదుకోండి

- విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ఘోరవిఫలం
- వాతావరణ శాఖ హెచ్చరించినా స్పందించని ప్రభుత్వం
- కనీసం అన్నపానీయాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో పాలకులు
- వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ(నూజెండ్ల): ఇటీవల సంభవించిన వరదల్లో విజయవాడ వాసులను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ వారం రోజులు ముందుగా వాతావరణ శాఖ ఈ వరదపై ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కనీసం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా నిర్లక్ష్యం వహించి చాలామంది ప్రాణనష్టం ఆస్తినష్టానికి కారణమైందన్నారు. వరద వచ్చిన తరువాత కూడా వారికి సహాయక చర్యలు చేపట్టడంలో కూడా ప్రభుత్వ వైఫల్యం చెందిందని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలతోపాటు బాధితులకు ఆహార పంపిణీ కూడా సక్రమంగా చేయకపోవటంతో ఎంతో మంది ఆకలితో అలమటించడం చాలా బాధాకరమన్నారు. చంద్రబాబు ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణ పవర్‌ప్లాంట్ మునిగిపోకుండా బుడమేరు నుంచి నీటిని వెలగేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ పట్టణం మీదకు వదలి ఘోరమైన ప్రమాదానికి చంద్రబాబు కారణమయ్యారని విమర్శించారు. బాబు ముందుగా మునిగిపోతున్న తన ఇంటిని ఖాళీచేసి విజయవాడ కలెక్టరు కార్యాలయానికి వచ్చారే కానీ ప్రజలకు మాత్రం రక్షణ కల్పించ లేకపోయారని, ప్రభుత్వ అసమర్థత వల్లే సుమారు 50 మంది వరదల్లో మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. సురక్షిత ప్రాంతాలకు స్థానికులు ఎవరికి వారే తరలి వెళ్లారే తప్ప ప్రభుత్వం తరలించే ప్రయత్నం చేయలేకపోవడం దారుణమన్నారు.

సిగ్గుచేటు!

కనీసం తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలు పాలకులు ఇవ్వలేకపోవడం సిగ్గుచేటన్నారు. వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత కూడా సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ, ఎనిమిది రోజులపాటు లక్షల మంది ప్రజలు వరదనీటిలో నరకం అనుభవించారని, ముఖ్యమంత్రి చంద్ర బాబు కేవలం అధికారులతో సమీక్షల పేరిట కాలయాపన చేశారు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో కృష్ణానది వెంబడి రిటర్నింగ్‌వాల్ నిర్మించడం వల్ల నేడు ఎంతోమంది ఆస్తి-ప్రాణనష్టాలు జరగకుండా నిలబడిన విషయాన్ని బ్రహ్మనాయుడు గుర్తుచేశారు. ఇప్పటికైనా వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బాబు ప్రచార ఆర్భాటాలు మానుకుని నష్ట పరిహారంపై దృష్టి సారిస్తే బాగుంటుంది.

అసాంఘిక కార్యకలాపాల నివారణకు చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: నియోజకవర్గంలో అక్రమ వ్యాపారాలు, దందాలు, గుట్కా, మట్కా, కల్తీ మద్యం, పేకాట, కోడిపందెలు లాంటి అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పని చేయిస్తున్నామని, ఎక్కడ ఎవరు తప్పు చేసినా క్షమించేదిలేదని అంటూ ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. పట్టణంలో 80 శాతానికి పైగా కాలువలను శుభ్రం చేసి మురుగు లేని విధంగా తయారు చేశామని అన్నారు. టీడీపీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, కడియం కోటి సుబ్బారావు సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులపై కొరడా

- 3502 సర్వీసులు తనిఖీచేసి రూ.10.27లక్షల అపరాధ రుసుం విధింపు
- నరసరావుపేట డీ–2సెక్షన్‌లో విజిలెన్స్, ఆపరేషన్ విభాగ అధికారుల దాడులు



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

నరసరావుపేట: విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్న వారిపై ఆశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం నరసరావుపేట డీ–2 సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగ అధికారులు టీంలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేశారు. 3502 సర్వీసులు పరిశీలించి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై రూ.10.27లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యాలయంలో విజిలెన్స్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సూర్యప్రకాష్, ఎస్.శ్రీనివాసరావులు వివరాలను విలేకర్లకు వెల్లడించారు. ప్రకాష్‌నగర్, వరవకట్ట, అరండల్‌పేట, రామిరెడ్డిపేట, ఇస్లాంపేట, 60 అడుగులరోడ్డు ప్రాంతాల్లో 92 మంది అధికారులు, 276 మంది సిబ్బంది 92 బృందాలుగా ఏర్పడి సర్వీసులను తనిఖీ చేయటం జరిగిందన్నారు. అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.10 వేలు, అదనంగా విద్యుత్ లోడు వాడుతున్న 193 మందికి రూ.10.17 లక్షల అపరాధ రుసుం విధించారన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులకు కొన్ని సూచనలు చేశారు. తప్పనిసరిగా విద్యుత్ మీటర్లకు సీలు ఉండేలా చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో సిబ్బందికి తెలియచేయాలని సూచించారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్న, ఉండాల్సిన మీటరుకు బదులుగా వేరే మీటరు ద్వారా సీలు లేకుండా విద్యుత్ వాడుకున్న విద్యుత్ చౌర్యం కింద పరిగణించి అపరాధం రుసుం వసూలు చేయబడుతుందని చెప్పారు. మొదటి సారి తప్పిదానికి మూడురెట్లు, రెండోసారి తప్పిదానికి ఆరురెట్లు జరిమానా విధించటం జరుగుతుందన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరంగా పరిగణిస్తూ అటువంటి వాటిపై 94408 12263, 94408 12360, 94408 12361 నంబర్లకు నేరుగా కాని, వాట్సప్‌కు గాని సమాచారం అందజేయాలని కోరారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, వై.ఏడుకొండలు, ఏఈలు కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పీహెచ్‌సీ, సచివాలయాలను సందర్శన
- హైస్కూలులో మధ్యాహ్న భోజనం పరిశీలన



నాదెండ్ల పీహెచ్‌సీలో వైద్యురాలు సాయిశ్వేతతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



నాదెండ్ల హైస్కూలులో మధ్యాహ్న భోజన పథకం పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నాదెండ్ల: ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, తూబాడు, సాతులూరు గ్రామ సచివాలయాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీని సందర్శించి ఆపరేషన్ థియేటర్, ఆయుష్ గది, స్త్రీలు, పురుషుల వార్డు పరిశీలించారు. పురుషుల వార్డులో మహిళా రోగి ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఆపరేషన్ గదిలో ఏసీ రిపేరులో ఉండటం, ఆయుష్ గదిలో సిబ్బంది లేకపోవటం గమనించారు. దీనిపై వైద్యాధికారి సాయిశ్వేత మాట్లాడుతూ ఆయుష్ విభాగంలో డాక్టర్, కంపౌండర్ ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏసీ రిపేరుకు ఇచ్చామని, త్వరలో అమరుస్తామన్నారు. ప్రతిరోజూ వైద్యశాలకు ఎంతమంది ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని, అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందివ్వండి

నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ అరుణ్‌బాబు సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా అంటూ విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. భోజన సమయంలో కొందరు విద్యార్థులకు తక్కువగా అన్నం పెట్టడంపై గమనించి, వారికి కడుపునిండా భోజనం పెట్టాలని ఆదేశించారు. అయితే చివర్లో కొందరు చిన్నారులకు కుర్మా లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తూబాడు, సాతులూరు సచివాలయాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది ప్రజలు దరఖాస్తులు అందిస్తున్నారు, ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తున్నారని ఆరా తీశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విధులకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, ఎంఈవో కృష్ణారెడ్డి, హెచ్ఎం నిర్మల, పంచాయతీ కార్యదర్శులు మారుతిబాబు, జంగు జరీనా తదితరులు ఉన్నారు.

విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రభుత్వాలు కాపాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నరసరావుపేట: విశాఖ స్టీలు ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం స్టీలుప్లాంట్ నిర్వాహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల ఆర్డీవో కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ మాట్లాడుతూ దేశంలో లాభ, నష్టాలతో సంబంధంలేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కును విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.శివకుమారి, కాకుమాను రామారావు, శిలార్ మసూద్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో రాష్ట్రంలో ఉన్న ఒకేఒక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రవేటీకరించేందుకు కుట్రలు పన్నుతున్నదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు ధ్వజమెత్తారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితిలో పిలుపులో మేరకు మంగళవారం విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా చిత్రాలయ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, ఏఐటీయూసీ నాయకులు దాసరి వరహాలు, షేక్.చిన్నజాన్‌సైదా, జక్రం తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆలోచనలు విరమించుకోవాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికితీయండి

శావల్యాపురం: విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికితీయడానికి ప్రతిభ పరీక్షలు నిర్వహించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని పొట్లూరు గ్రామం ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. ఆయనతో పాటు ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి, ప్రధానోపాధ్యాయరాలు లక్ష్మికుమారి ఉన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి తెలిపారు. పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ పార్వతి, స్కౌట్ విద్యార్థుల అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ పమ్మి వెంకటరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్‌కె.ఫాతిమాలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో నారుమడుల్లో తెగుళ్ల నివారణ



ఈపూరులో వరినారును పరిశీలిస్తున్న సైంటిస్ట్‌లు, వ్యవసాయాధికారులు

శావల్యాపురం: అకాల వర్షాల వల్ల వరినారుమడుల్లో తెగుళ్ల నివారణకు రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త ఎస్.సాంబశివరావు సూచించారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో అకాల వర్షాల వలన తెగుళ్లు సోకిన వరి నారుమడులను పరిశీలించి అనంతరం రైతుసేవా కేంద్రంలో సస్యరక్షణ చర్యలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త సాంబశివరావు మాట్లాడుతూ అకాల వర్షాల ధాటికి వరి నారుమడుల్లో వరిలో కాండం కుళ్ళు తెగులు, ఇనుప ధాతు లోపం, ఎదుగుదల లోపం తెగుళ్లు సోకిందని వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరి నారుమడులు పరిశీలించిన వారిలో లాంఫామ్ శాస్త్రవేత్తలు పి.అమరజ్యోతి, యం.వెంకటేశ్వర్లు, డీడీఏ మద్దినేని శివకుమారి, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవోలు రామినేని రామారావు, పల్లపోతుల ప్రవీణ్, ఏఈవో పురేటి అశోక, వీఏఏలు హరిబాబు, అనుషా, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన


ఈపూరు: మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని పొలాలను లాం సీనియర్ సైంటిస్ట్‌లు, నరసరావుపేట డాట్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్‌లు మంగళవారం సందర్శించారు. గ్రామంలోని వరి నర్సరీలను వారు పరిశీలించారు. నాట్లు వేసిన తరువాత వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు నారు దశలోనే అధికారులు తెలిపిన మందులను వినియోగించాలన్నారు.

నరసరావుపేట రూరల్‌లో...

నరసరావుపేట రూరల్: పత్తిలో పిండి నల్లి, పేనుబంక, తెల్లదోమ, పచ్చ దోమ నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని యల్లమంద గ్రామంలోని పత్తి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. పత్తిలో పిండి నల్లి నివారణ చర్యలను తెలియజేశారు.



వినుకొండలో కార్ ట్రావెల్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



నరసరావుపేటలో దానిమ్మపండ్లతో పూజలందుకున్న గణనాథుడు



రొంపిచర్లలో కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయకుడు



గణపవరం బ్రహ్మంగారి వీధిలోని వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు



పుడమికి పచ్చబొట్లు

శావల్యాపురం మండలంలో పొలం పనులు ఊపందుకున్నాయి. సాగర్ జలాశయం నిండటం, కాల్వలకు నీళ్లు రావడంతో అన్నదాతల ఆనందంతో వరి సాగుకు సమాయత్తమయ్యారు. ఇప్పటికే కాల్వలు, కుంటలు, వాగుల పరిధిలో వరి నారు మళ్లతో పాటు వరినాట్లు వేస్తున్నారు. అయితే వరి సాగులో రైతులు తీసుకోవాల్సిన మెలకువలపై వ్యవసాయ అధికారులు సూచనలు సలహాలు పాటిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని వివరించారు.

–శావల్యాపురం